వెలుగు రేఖల తెలంగాణ

విద్యుత్తు రంగంలో అగ్రగామిగా తెలంగాణ • కేసీఆర్ సర్కారులో చీకటి నుంచి వెలుగులు • రాష్ట్ర విద్యుత్తు విజయాలు దేశానికి కేస్‌స్టడీ

విద్యుత్తు కోతలు నేటి తరానికి తెలియని స్థితి • పారిపోయిన పవర్ హాలిడేలు, కరెంట్ కోతలు • పవర్ కట్ నుంచి మిగులు విద్యుత్తు స్థాయికి

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): ఒకప్పుడు యంత్రాలు నడవాలంటే కరెంటు కోసం పక్కచూపులు చూసే స్థితి నుంచి కోతల్లేని స్థితికి తెలంగాణ విద్యుత్తు రంగం పురోగమించింది. అంతులేని కరెంట్ కోతలు దూరమయ్యాయి. పవర్ హాలిడేలు మాయమయ్యాయి. విద్యుత్తు కటకట స్థితి నుంచి స్వయం సమృద్ధిని సాధించి మిగులు విద్యుత్తు దిశలో ముందుకు సాగుతున్నది. మొత్తంగా తెలంగాణ విద్యుత్తు ధగధగల్లో వెలిగి, ప్రపంచ పటంలో ప్రకాశించింది. దేశ విద్యుత్తు రంగానికి పాఠమైంది. అనేక రాష్ట్రాలకు కేస్‌స్టడీ అయ్యింది. దశాబ్ది ఉత్సవాల ముగింపు వేళ ఈ పదేండ్ల ప్రస్థానాన్ని మళ్లీ మననం చేసుకుందాం.

కొత్తవి ప్రారంభించి.. కోతలను అధిగమించి..

గత ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ ప్రైవేట్ రంగంలో విద్యుత్తు ఉత్పాదనను ప్రోత్సహించాయి. కానీ, కేసీఆర్ సర్కారు ప్రభుత్వ రంగంలో తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలోని ప్లాంట్లను పెద్దఎత్తున వినియోగంలోకి తెచ్చింది. పదేండ్లలో పలు ప్లాంట్లను మెరుపు వేగంతో పూర్తిచేసింది. కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కేటీపీపీ)లో 600 మెగావాట్లు, దిగువ జూరాలలో 240 మెగావాట్లు, పులిచింతలలో 120 మెగావాట్లు, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (స్టేజ్-7)లో 800 మెగావాట్లు, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో 1,080 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను వినియోగంలోకి తెచ్చింది. కేవలం 48 నెలల రికార్డు సమయంలోనే కేటీపీస్‌లో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇదో రికార్డు.

అన్ని రంగాలకు నిరంతర విద్యుత్తు

రాష్ట్రం ఏర్పడిన కొద్దికాలంలోనే విద్యుత్తు కోతలను తెలంగాణ అధిగమించింది. అన్ని రంగాలకు నిరంతర నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్న రాష్ట్రంగా ఆవిర్భవించింది. కేసీఆర్ దార్శనికతలో ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవసాయ, పారిశ్రామిక, సేవ, వ్యాపార రంగాలకు తోడ్పాటు అందింది. 2014లో 7,778 మెగావాట్లుగా ఉన్న విద్యుత్తు ఉత్పాదక సామర్థ్యాన్ని, 2023 నాటికి 18,567 మెగావాట్లకు పెంచింది. విద్యుత్తు సరఫరా వ్యవస్థలను సైతం బలోపేతం చేసింది. ఉత్పత్తి సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు తొమ్మిదేండ్లల్లో రూ.97,321 కోట్లు వెచ్చించింది.

విద్యుత్తు వెలుగుల ప్రస్థానం (మెగావాట్లలో)	2014	2024	తేడా
స్థాపిత విద్యుత్తుసామర్థ్యం	7,778	18,567	10,789
సోలార్ సామర్థ్యం	74	5,865	5,791
పీక్ డిమాండ్	5,661	15,497	9,836
గ్రిడ్ వినియోగం (ఎంయూ)	128	294	169

విద్యుత్తు వ్యవస్థల సమగ్ర స్వరూపం

అంశం	2014కు ముందు	2024లో	తేడా
400 కేవీ సబ్‌స్టేషన్లు	06	25	19
220 కేవీ సబ్‌స్టేషన్లు	51	103	52
132 కేవీ సబ్‌స్టేషన్లు	176	250	74
33 కేవీ సబ్‌స్టేషన్లు	2138	3200	1062
33 కేవీ, 11కేవీ, ఎల్‌టీ లైన్లు లక్షల కి.మీ.	4.89	6.72	1.83
పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	3272	5672	2400
డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (లక్షలు)	4.67	8.56	3.89
ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లు	233	378	145
ఈహెచ్‌టీ లైన్ (కి.మీ.)	16379	27986	11607
ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యం	14973	39345	24372
వ్యవసాయ కనెక్షన్లు (లక్షలు)	19.03	27.49	8.46
మొత్తం కనెక్షన్లు(కోట్లల్లో)	1.11	1.78	0.67

విద్యుత్తు రంగంలో కేసీఆర్ సర్కారు ఘనతలు

- తెలంగాణ ఆవిర్భవించినపుడు స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 7,778 మెగావాట్లు. కేసీఆర్ సర్కారు కృషితో 2024 కల్లా ఆ సామర్థ్యం 18,567 మెగావాట్లకు చేరింది.
- ఈ రోజు 15 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నా, సబ్‌స్టేషన్లు కాలటం లేదంటే, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవటం లేదంటే, కేసీఆర్ సర్కారు ముందుచూపే కారణం. విద్యుత్తు రంగం బలోపేతం కోసం, కరెంట్ సరఫరా, పంపిణీ వ్యవస్థలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రూ.39,321 కోట్లు ఖర్చుచేసింది. ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ బలోపేతానికి రూ.18,874 కోట్లు, విద్యుత్తు పంపిణీ నెట్‌వర్క్ పునరుద్ధరణకు పల్లెప్రగతిలో రూ.506 కోట్లు, పట్టణ ప్రగతిలో రూ.249 కోట్లు ఖర్చు చేసింది.
- రాష్ట్రంలోని 27.49 లక్షల వ్యవసాయ మోటర్లకు 100 శాతం సబ్సిడీతో 24 గంటల ఉచిత విద్యుత్తును ఇచ్చింది. రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు కొత్తగా 8 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చింది.
- విద్యుత్తు సంస్థల్లో పనిచేస్తున్న 22,7232 మంది కార్మికులను ఆర్టిజన్లుగా క్రమబద్ధీకరించింది.
- 2014 మార్చి 23న ఉమ్మడి ఏపీలో గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 13,162 మెగావాట్లు కాగా, స్వరాష్ట్రంలో 2023 మార్చి 23న నమోదైన గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 15,497 మెగావాట్లు. అంటే 23 జిల్లాల ఉమ్మడి రాష్ట్రం కన్నా.. పాత పది జిల్లాల తెలంగాణ గరిష్ఠ విద్యుత్తు డిమాండే అధికం. ఇక 2023 మార్చి 14న రికార్డు స్థాయిలో 297.89 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం నమోదైంది.
- 2014లో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల సంఖ్య 19.03 లక్షలు. 2023 మే 1 వరకు వీటి సంఖ్య 27.49 లక్షలకు చేరింది.
- రాష్ట్రంలోని విద్యుత్తు కనెక్షన్లు 2014లో 1.11 కోట్లు. 2023 మే 1 నాటికి మొత్తం కనెక్షన్ల సంఖ్య 1.78 కోట్లకు చేరింది.
- ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ద్వారా విద్యుదుత్పత్తి చేయటంలోనూ తెలంగాణ అగ్రగామిగా నిలుస్తున్నది. రాష్ట్రం ఏర్పడిననాడు సౌర విద్యుత్తు 74 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి అయ్యేది. ప్రత్యేక చర్యల వల్ల 2023 నాటికి సోలార్ పవర్ ఉత్పత్తి 5,865 మెగావాట్లకు చేరింది.
- 2021-22 నాటికి లక్ష్యానికంటే రికార్డు స్థాయిలో 5,654.7 మెగావాట్ల జలవిద్యుత్తు ఉత్పత్తిని టీజెన్‌కో సాధించింది.
- విద్యుత్తు సరఫరా నష్టాలు భారీగా ఉండేవి. కానీ తెలంగాణలో నష్టాలు 2.74 శాతం మాత్రమే. దేశంలో ఇదే అతి తక్కువ.

విద్యుత్తు రాయితీలుగా..

కేసీఆర్ హయాంలో విద్యుత్తు సబ్సిడీల ద్వారా ఏటా లబ్ధిపొందిన వినియోగదారులు.. 72.41 లక్షలు. వీరికి ఏటా సబ్సిడీగా అందించిన మొత్తం రూ.50 వేల కోట్లు. మొత్తం 27,48,598 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు ఉచిత విద్యుత్తును అందించింది.

- నెలకు 0-50 యూనిట్స్‌ను వినియోగించే 35,61,809 గృహవినియోగదారులు, నెలకు 101 యూనిట్స్‌లోపు విద్యుత్తును వాడుతున్న 5,25,433 షెడ్యుల్డ్ కులాల (ఎస్సీ) వినియోగదారులు, 2,95,114 మంది షెడ్యుల్డ్ తెగల (ఎస్టీ) వినియోగదారులు విద్యుత్తు రాయితీలను పొందారు.
- నెలకు 250 యూనిట్ల లోపు విద్యుత్తును వాడుతున్న 6,494 మంది పౌల్ట్రీ రైతులు, 32,654 హెయిర్ కటింగ్ సెలూన్‌దారులు, 65,806 లాండ్రీ షాపులవారు, 56 ధోబీఘాట్స్ లబ్ధిదారులు విద్యుత్తు సబ్సిడీ ప్రయోజనం పొందారు.
- వీరితో పాటు 5,011 పవర్‌లూమ్స్, 39 స్పిన్నింగ్ మిల్స్‌కు సైతం సబ్సిడీపై ప్రభుత్వం విద్యుత్తును సరఫరా చేసింది.

ఐదు నెలల్లోనే మళ్లీ కరెంట్ కోతలు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పదేండ్ల పాటు రాష్ట్రంలో కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా జరుగగా, కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన ఐదు నెలల్లో మళ్లీ కరెంట్ కోతలు మొదలయ్యాయి. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకుల సభల్లోనే కరెంట్ కోతలు జరిగిన విషయం మీడియాలో వచ్చింది. ఇప్పటికీ ఎక్కడో ఒక చోట రాష్ట్రంలో కరెంట్ పోవడం నిత్యకృత్యంగా మారింది. ఇటీవల వానలకు విద్యుత్తు వ్యవస్థ దెబ్బతిని కొన్ని గ్రామాలు అంధకారంలో మగ్గిపోయాయి. కొన్ని మండలాలకు రోజంతా కరెంట్ సరఫరాను అధికారులు పునరుద్ధరించలేకపోయారు.

తలసరిలో నంబర్ 1

తలసరి విద్యుత్తు వినియోగం ప్రగతికి ఒక ప్రధాన సూచిక. 2014-15లో తెలంగాణలో తలసరి విద్యుత్తు వినియోగం 1,356 యూనిట్లు మాత్రమే. 2021-22 నాటికి ఇది 2,126 యూనిట్లకు పెరిగింది. ఇది జాతీయ తలసరి వినియోగం కన్నా 69.40 శాతం ఎక్కువ. మిగులు విద్యుత్తులో రాష్ట్రం కీలక అడుగులేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం గల 4 యూనిట్లను ప్రారంభించింది. నల్లగొండ జిల్లా దామరచర్లలో టీఎస్ జెన్‌కో నిర్మిస్తున్న 4 వేల మెగావాట్ల యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్ రెండు దశల్లో ఇటీవలే ముందుడుగు పడింది. రెండు యూనిట్లల్లోని బాయిలర్లల్లో విజయవంతంగా బొగ్గును మండించారు. మరో మూడు యూనిట్లు త్వరలోనే వినియోగంలోకి రానున్నాయి.

లబ్ధిపొందిన వినియోగదారులు (సంవత్సరంలో)

క్యాటగిరీ	టీఎస్ఎస్పీడీసీఎల్	టీఎస్ఎన్పీడీసీఎల్	మొత్తం
వ్యవసాయం వినియోగదారులు	13,87,116	13,61,482	27,48,598
గృహ వినియోగదారులు (0-50 యూనిట్లు)	21,93,976	13,67,833	35,61,809
ఎస్సీలు (నెలకు 0-101యూనిట్లు)	2,33,579	2,91,854	5,25,433
ఎస్టీలు (నెలకు 0-101యూనిట్లు)	1,04,708	1,90,406	2,95,114
పవల్‌లూమ్ వినియోగదారులు (యూనిట్‌కు రూ.2)	3,134	1,877	5,011
స్పిన్నింగ్‌మిల్స్ (యూనిట్‌కు రూ.2)	37	02	39
పౌల్ట్రీఫార్మర్స్ (యూనిట్‌కు రూ.2)	3,590	3,104	6,494
హెయిర్ కటింగ్ సెలూన్స్ (250 యూనిట్ల వరకు)	19,056	13,598	32,654
లాండ్రీ షాపులు (250యూనిట్ల వరకు)	39,303	26,503	65,806
ధోబీఘాట్లు (250 యూనిట్ల వరకు)	37	19	56
మొత్తం	39,77,227	32,56,678	72,41,014

సింగరేణి.. వెలుగుల వేణి

తెలంగాణ ఆవిర్భావం తర్వాత సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, రవాణా, లాభాలు, టర్నోవర్‌లో అద్భుత వృద్ధిని సాధించింది. సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణాన్ని శరవేగంగా పూర్తిచేసింది. గత 8 ఏండ్లల్లో 14 కొత్త గనులను సాధించింది. మరో 8 గనులు సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నది. 2014కు పదేండ్ల ముందు కేవలం 6,453 ఉద్యోగాలిస్తే, కేసీఆర్ హయాంలో 19,463 మందికి ఉద్యోగాలిచ్చింది. మరో 15,256 మందికి డిపెండెంట్ ఉద్యోగాలిచ్చింది. నోటిఫికేషన్ల ద్వారా మరో 4,207 ఉద్యోగాలిచ్చింది. 3,490 మందికి పదోన్నతులు కల్పించింది. సింగరేణి ఉద్యోగుల పదవీ విరమణ వయసును 61కు ఏండ్లకు పెంచింది. 2021 మార్చి 30 నుంచి ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నారు. 11,685 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ చేశారు. రాష్ట్ర విద్యుత్తు అవసరాలు తీర్చేందుకు 2016-23 వరకు 58,556 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తిచేసి, 55,034 మిలియన్ యూనిట్లను రాష్ట్రానికి సరఫరా చేసింది. సింగరేణివ్యాప్తంగా 300 మెగా సోలార్ విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేస్తుండగా, వీటిలో 224 మెగావాట్లను గ్రిడ్‌కు అనుసంధానించారు. జలాశయాల్లో తేలియాడే 350 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను సైతం సంస్థ ఏర్పాటు చేస్తున్నది.

- లాభాల బోనస్ 2014లో 18 శాతంగా ఉండేది. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2015లో 21 శాతానికి పెంచింది. ఆ తర్వాత 2016లో 23 శాతం, 2017లో 25 శాతం, 2018లో 27 శాతం, 2019లో 29 శాతం, 2020లో 28 శాతం, 2021లో 29 శాతం, 2022లో 30 శాతం చొప్పున లాభాల్లో వాటాను పంపిణీ చేసింది.
- దీపావళి బోనస్‌ను సైతం గణనీయంగా పెంచింది. 2022లో ఒక్కో కార్మికుడు రూ.76 వేలు దీపావళి బోనస్‌గా అందకున్నారు. దీంతో కార్మికులు అందుకొనే మొత్తం బోనస్ డబుల్ అయ్యింది.
- గతంలో పండుగ అడ్వాన్స్ రూ.10 వేలు మాత్రమే ఉండగా, 2015లో రూ.16 వేలు, 2016లో రూ.18 వేలు, 2017 నుంచి రూ.25 వేలకు పెంచి ఇస్తున్నారు.
- కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్‌ను 10 రెట్లు పెంచింది. గతంలో రూ.లక్ష మాత్రమే ఇచ్చేవారు. కానీ ఇప్పుడు రూ.10 లక్షలు చెల్లిస్తున్నారు.
- గతంలో డిపెండెంట్ ఉద్యోగాలు వదులుకుంటే ఏకమొత్తంగా రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చేవారు. కానీ ఇప్పుడు దాన్ని రూ.25 లక్షలకు పెంచి అందిస్తున్నారు. కార్మికులు సొంతింటి నిర్మాణానికి రూ.పది లక్షల వరకు రుణానికి సంస్థే వడ్డీ చెల్లిస్తున్నది.

బొగ్గు ఉత్పత్తి (మెట్రిక్‌టన్నులు)

2014కు ముందు	2024లో
50.47	67.14

పెరుగుదల 33%

బొగ్గు రవాణా (మెట్రిక్‌టన్నులు)

2014కు ముందు	2024లో
47.94	66.69

పెరుగుదల 39%

బొగ్గు విక్రయాల (కోట్లల్లో)

2014కు ముందు	2024లో
11,928	32,978

పెరుగుదల 176%

నికరలాభం (కోట్లల్లో)

2014కు ముందు	2024లో
419	2,350

పెరుగుదల 461%

ఓవర్‌బర్డెన్ తొలగింపు (మిలియన్ క్యూ.మీ.)

2014కు ముందు	2024లో
168.78	410.11

పెరుగుదల 142%

సంవత్సరం	దీపావళి బోనస్ (కోట్లల్లో)	ఒక్కో కార్మికుడు అందుకున్నది (రూపాయల్లో)	లాభాల బోనస్ (కోట్లల్లో)	ఒక్కో కార్మికుడు అందుకున్నది (రూపాయల్లో)	మొత్తం బోనస్ (రూపాయల్లో)
2014-15	278.55	48,500	102.99	17,252	65,752
2015-16	302.95	54,000	245.21	41,923	95,923
2016-17	310.19	57,000	98.85	17,563	74,563
2017-18	302.43	60,500	327.44	60,369	1,20,869
2018-19	258.00	64,700	493.82	1,00,899	1,65,599
2019-20	275.00	68,500	278.28	60,468	1,28,968
2020-21	288.84	72,500	79.07	18,647	91,147
2021-22	296.69	76,500	368.11	89,634	1,66,134

జడ్చర్ల పట్టణంలోని బాదేపల్లి మార్కెట్‌యార్డులో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

పాలమూరులో భారీ వర్షం

జడ్చర్ల మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం బస్తాలు

ఈదురుగాలులతో పలుచోట్ల నిలిచిన కరెంటు సరఫరా

నెట్‌వర్క్ మహబూబ్‌నగర్/బీబీపేట్, మే 20 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరింది. బాదేపల్లి మార్కెట్‌యార్డులోని ధాన్యంతోపాటు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు లారీల్లోకి ఎక్కిస్తుండగా తడిసినట్టు వ్యాపారులు తెలిపారు. జడ్చర్ల ఫ్లైఓవర్, పట్టణ ప్రధాన రహదారిపై, ఆలూర్ రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి నీరు చేరి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం బొంకూరులో చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. తిమ్మాజిపేట నుంచి జడ్చర్ల-నాగర్‌కర్నూల్ దారిలో ఇంద్రానగర్, తండా సమీపంలో చెట్లు విరిగి రోడ్డుపై పండటంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. అచ్చంపేట బస్టాండ్‌లో భారీగా నీరు నిలిచింది. నాగర్‌కర్నూల్ మండలం గన్యాగుల గ్రామంలో పిడుగుపాటుకు ఆరు గొర్రెలు, రెండు పొట్టేళ్లు మృతి చెందాయి.

ధాన్యం కొనడం లేదని రైతుల ఆందోళన

అకాల వర్షాలకు వడ్లు తడిసి మొలకలు వస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు రోడ్డుపై బైఠాయించారు. కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలంలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని మల్కాపూర్‌కు చెందిన రైతులు బీబీపేట్ మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. వర్షానికి తడిసి ముద్దయిన వడ్లు మొలకెత్తి తీవ్రంగా నష్టాపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఇంద్రాసేనారెడ్డి అక్కడకు చేరుకుని లారీల కొరత వల్ల ఇబ్బందులు వస్తున్నాయని, వారంలోపు ధాన్యాన్ని తరలిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

గొర్రెలు ఇవ్వకుంటే.. డీడీ డబ్బులైనా ఇవ్వండి

కలెక్టర్‌కు మొరపెట్టుకున్న రాజన్నగూడెం గొల్లకుర్మలు

నల్లగొండ, మే 20: గొర్రెల యూనిట్లు రాకపోవడంతో తమకు గొర్రెలు ఇవ్వకున్నా ఫర్వాలేదు కానీ, తాము కట్టిన డీడీ డబ్బులైనా ఇవ్వాలని గొల్లకుర్మలు కోరుతున్నారు. సోమవారం నల్లగొండ కలెక్టర్ హరిచందనను లబ్ధిదారులు వేడుకున్నారు. తాము అప్పులు తెచ్చి డీడీలు కట్టామని, ఏడు నెలలుగా ఆ సొమ్ముకు వడ్డీ పెరిగిపోతున్నదని వాపోయారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం రాజన్నగూడెం గ్రామానికి చెందిన 61 మంది గొల్లకుర్మలు రెండో విడత గొర్రెల యూనిట్లకు రూ.43,750 చొప్పున కలెక్టర్ పేరు మీద డీడీలు చెల్లించారు. గతేడాది గొర్రెల యూనిట్లు ఇచ్చే సమయంలో ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ రావడంతో ఆ పథకం అమలు నిలిచిపోయింది. కాగా డిసెంబరు 3న ఎన్నికల కోడ్ ముగిసింది. అయితే సబ్సిడీ గొర్రెలు ఇచ్చేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో తమకు డీడీ డబ్బులు అయినా ఇవ్వాలని ఐదు నెలలుగా లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో డీడీ డబ్బులు తిరిగి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

నల్లగొండలో విలేకరులతో మాట్లాడుతున్న గొల్లకుర్మలు

కేజ్రీవాల్ లక్ష్యంగా మెట్రో రైళ్లలో గ్రాఫిటీ

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకుని ఢిల్లీ మెట్రో రైళ్లు, స్టేషన్లలో కొన్ని హెచ్చరికలు, నినాదాలను రాశారు. దీనిపై ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మెట్రో డిప్యూటీ పోలీస్ కమిషనర్ జీ రామ్ గోపాల్ నాయక్ సోమవారం తెలిపారు. ఈ రాతల వెనుక బీజేపీ హస్తం ఉందని ఆప్ నేతలు ఆరోపించారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌ను ఆప్ కోరింది. ఈ రాతల ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన అకౌంట్‌ను గుర్తించినట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు.

ఆదిలాబాద్‌లో విత్తన దుకాణం ఎదుట పత్తి విత్తనాల కోసం రైతుల ఆందోళన

పత్తి విత్తనాల కొరత

- సీజన్ ఆరంభంలోనే రైతుల ఆందోళన
- ఆదిలాబాద్‌లో నో స్టాక్ బోర్డులు
- బ్లాక్‌లో అమ్ముతున్నారంటూ ఆగ్రహం
- సరఫరా లేదంటున్న వ్యాపారులు

ఆదిలాబాద్, మే 20(నమస్తే తెలంగాణ) : వానకాలం సీజన్ ఆరంభంలోనే పత్తి విత్తనాల కొరత ఏర్పడింది. అప్పుడే ఆదిలాబాద్ జిల్లాలో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. పత్తి విత్తనాలు లేవంటూ దకాణదారులు తెగేసి చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు సకాలంలో కురుస్తుండటంతో రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో రైతులు ఎక్కువగా పత్తి సాగు చేస్తారు. సోమవారం జిల్లాలోని రైతులు విత్తన దుకాణాలకు వచ్చి ఆర్‌సీహెచ్ 659 పత్తి విత్తనాలు కావాలని అడిగారు. ఆ రకం విత్తనాలు లేవని దుకాణదారులు చెప్పడంతో వారంతా రైతులు ఆందోళన చేపట్టారు. పలు దుకాణాల్లో నో స్టాక్ బోర్డులు కూడా పెట్టడం చూసి కంగుతిన్నారు. విత్తనాల కోసం మూడు, నాలుగు రోజుల నుంచి వస్తున్నా దుకాణాల్లో ఆర్‌సీహెచ్ 659 విత్తనాలు దొరకడం లేదని, విత్తనాల సరఫరాలో అధికారులు విఫలమయ్యారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణాదారులు విత్తనాలను బ్లాక్‌లో ఎక్కువ ధరలకు అమ్ముతున్నారంటూ ధ్వజమెత్తారు. కంపెనీ నుంచి విత్తనాల సరఫరా లేకపోవడంతో తాము రైతులకు ఇవ్వలేకబోతున్నామని వ్యాపారులు పేర్కొంటున్నారు. వేరే కంపెనీల పత్తి విత్తనాలు అవసరం లేదని, ప్రభుత్వం స్పందించి విత్తనాలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

బ్లాక్‌లో అమ్ముతున్నారు

ఆర్‌సీహెచ్ 659 పత్తి విత్తనాల కోసం రెండు, మూడు సార్లు ఆదిలాబాద్‌కు వచ్చి దుకాణాల్లో అడిగితే స్టాక్ లేదని చెప్తున్నారు. ఒక ప్యాకెట్ ధర రూ.860 అంటున్నారు. వ్యాపారులు బ్లాక్‌లో ఎక్కువ ధరకు అమ్ముకొంటున్నారు. అధికారులే స్వయంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి.

– దిగంబర్ రైతు, కొద్దూర్, బేల మండలం.

నష్టపోతే ఎవరిది బాధ్యత

నాకు 12 ఎకరాలున్నది. వానకాలంలో పత్తి సాగు చేస్తా. ఆర్‌సీహెచ్ విత్తనాలను వేస్తే పత్తి పంట మంచిగా వస్తుందనే నమ్మకం. ఇప్పటికే పత్తి విత్తనాలు కోసం మూడు సార్లు వచ్చినా స్టాక్ లేదని దుకాణదారులు చెప్తున్నారు. వేరే విత్తనాల వల్ల నష్టపోతే ఎవరిది బాధ్యత.

– గణేశ్, రైతు, కాంగర్‌పూర్, బేల మండలం.